## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో గంధాలంకరణ



బాబాకు చాదర్లు సమర్పిస్తున్న ముస్లింలు

**కొందుర్గు:** మండల కేంద్రంలోని హజ్రత్‌శాలిబాబా దర్గాలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో గంధాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు చాదర్లు, గంధంతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి బాబాకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న గ్రామస్తులు

**కేశంపేట:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం 2కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని 2కే రన్‌లో ఉల్లాసంగా పాల్గొన్నారు. వీరిలో మదన్‌కుమార్ ప్రథమ, మల్లేశ్ ద్వితీయ, నవీన్‌కుమార్ తృతీయస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, కార్యదర్శులు విద్యావతి, రమాదేవి, స్వరూప్ గ్రామస్తులు పవన్‌కుమార్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్, నాయకులు

**కేశంపేట:** మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో సోమవారం బతుకమ్మ పండగను పురస్కరించుకొని గ్రామానికి చెందిన పాలాది శ్రీనివాస్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 1300 మంది మహిళలకు పండగ సందర్భంగా చీరలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు అందె బాబయ్య, దయానంద సరస్వతి, యోగేశ్వర్‌స్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాంగౌడ్, మోటే శ్రీను పాల్గొన్నారు.

### బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని వినతి

**శంకర్‌పల్లి:** ఆడపడుచులు బతుకమ్మ ఆడుకోవడానికి వీలుగా గతంలో ఉన్న బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం సింగాపురం వాసులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్‌లకు వినతి పత్రం అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 9, 10వార్డు(సింగాపురం)లలోని సర్వే నం.390లో బతుకమ్మ కుంట ఉండేదని, ప్రతి ఏడాది బతుకమ్మ పండగరోజు ఆడపడుచులు బతుకమ్మ ఆడిన తర్వాత ఆ కుంటలో వేసే వారని పేర్కొన్నారు. గతేడాది పండగ తర్వాత ఆ కుంటను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మూసివేశారని, దీనిని మళ్లీ పునరుద్ధరించాలని, మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, దయాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, దేవయ్య, మల్లేశ్, సురేశ్, శ్రీశైలం, నరహరి తదితరులు ఉన్నారు.

### ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

**షాద్‌నగర్:** ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్‌ను సోమవారం షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లిన నాయకులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ద్వారా ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు రాములు, గడ్డమీది రమేశ్, మన్నె రవి, శంకర్, మంగ భీమయ్య, గుండు సురేశ్ తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు దాతల చేయూత

**షాబాద్:** పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని అంతారం పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన ఈగ మహిపాల్‌రెడ్డి మనుమరాలు ఈగ స్నితిక 4వ జన్మదినం సందర్భంగా సుమారు రూ.4వేల రూపాయల విలువ గల నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ శేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మమత, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# కంపుకొడుతోంది!

- మొయినాబాద్‌లో రోడ్డు పక్కనే చెత్త డంప్
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మొయినాబాద్‌-సురంగల్ రోడ్డు పక్కన కంపు కొడుతున్న చెత్త డంపు

**మొయినాబాద్:** మండల కేంద్రాన్ని డంపింగ్ కంపు పట్టి పీడిస్తోంది. గత నాలుగు సంవత్సరాలుగా రోడ్డు పక్కనే పెద్దఎత్తున చెత్త డంపింగ్ చేస్తుండడంతో స్థానికులతో పాటు రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం రోజురోజుకు విస్తరిస్తోంది. కొత్త కాలనీలు పెరుగుతున్న కొద్ది గ్రామంలో చెత్తా చెదారం కూడా పెరుగుతోంది. అయితే మొయినాబాద్‌కు డంపింగ్‌యార్డు లేకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్త మొత్తం హైదరాబాద్‌-బీజాపూర్ జాతీయ రహదారి బైపాస్ సం సేకరించిన స్థలంలో వేస్తున్నారు. రహదారి విస్తరణ పనులు జరగకపోవడంతో చెత్తంతా అక్కడే వేస్తున్నారు. మొయినాబాద్ నుంచి సురంగల్ వెళ్లే రోడ్డు పక్కనే ఈ చెత్తంతా వేస్తుండడంతో ఆ ప్రాంతమంతా కంపుకొడుతోంది. వర్షాలకు చెత్తంతా కుళ్లి భరించలేని దుర్వాసన వస్తోందని, ఈ చెత్త డంపింగ్‌తో పక్కనే ఉన్న కాలనీవాసులతో పాటు రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా చెత్త సమస్య తీరకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

- అధికారులు, వాటర్‌మెన్‌లు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఏఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్‌రూరల్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామీణ నీటి సరఫరా సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంలో మంచినీటి పాత్ర ఎంతో కీలకమన్నారు. మంచినీటి పైపులైన్, వాల్స్, జాయింట్స్ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు చేరే అవకాశాలు ఉంటాయన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు కలుషితం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి అంచనాలకు మించి ఖర్చు చేసినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి నీటి సరఫరా సహాయకులతో అధికారులు 15 రోజులకొకసారి సమీక్ష నిర్వహించాలని సూచించారు. అధికారులు, పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, మంచినీటికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. మంచినీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, సూర్యప్రకాశ్, మిషన్ భగీరథ ఎస్‌సీ ఆంజనేయులు, ఈఈ రాజేశ్వర్, ఇంట్ర డీఈ అబ్దుల్‌బారి, గ్రిడ్ డీఈ సందీప్, ఏఈలు ప్రీతి, జయశ్రీ, నాగమణి, కవిత, మోహిన్, ముజామిల్, ప్రదీప్, వాటర్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్ ) ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీ, గురుకుల, మైనార్టీ, పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతో పాటుగా షాట్‌పుట్, డిస్కస్‌త్రో, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. పోటీల్లో విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, వన్నాడ ప్రకాశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కళాశాలలో రక్తదాన శిబిరం**

పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో యువసత్తా యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ విశ్వనాథ్, పుల్లన్నచారి, కరుణాకర్, యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నాయకులు దంగు శ్రీను, పురుషోత్తంరెడ్డి, ఖాదీర్, అందె మోహన్, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

**కొందుర్గు:** మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల సిబ్బంది సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రత్నమాల, ప్రసాద్, లక్ష్మి, అప్పల రాజులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ గాయత్రి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయుల పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గోపినాథ్, హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### జోనల్‌స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

**కొందుర్గు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన క్రీడాపోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ స్వాములు, బాలాజీ తెలిపారు. ఖోఖో అండర్ 17 బాలుర విభాగంలో ప్రథమ, అండర్ 14 బాలుర విభాగంలో ద్వితీయ, కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో ద్వితీయ, వాలీబాల్ అండర్ 17 బాలుర విభాగంలో ప్రథమ, 14 బాలికల విభాగంలో ద్వితీయ బహుమతులకు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ గాయత్రిదేవి, జీహెచ్‌ఎం గోపినాథ్, తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీడీఓ అనురాధ విద్యార్థులను అభినందించారు.

### ‘ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓ అశాస్త్రీయం’

**చేవెళ్ల:** రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల ఉపాధ్యాయుల కోసం తీసుకొచ్చిన సర్దుబాటు జీఓ అశాస్త్రీయంగా ఉందని ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్‌చారి, గోపాల్‌లు అన్నారు. చేవెళ్లలో సోమవారం ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న జిల్లా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓపై మరోసారి ఆలోచన చేయాలని కోరారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా బి.కుమార్, అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ అంజనేయులు, శ్రీనివాస్, కోశాధికారిగా గురు రాజశేఖర్, మహిళా అధ్యక్షురాలిగా టి.అనసూయలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సెంఢ్వా ఎమ్మెల్యేకు స్వాగతం



ఎమ్మెల్యే మెంటు సోలంకితో మాట్లాడుతున్న కాలె యాదయ్య

**చేవెళ్ల:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సెంఢ్వా నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే మెంటు సోలంకికి అతని వెంట సైకిల్ యాత్రలో పాల్గొన్న తన అనుచరులకు చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం రాత్రి స్వాగతం పలికి వసతి బస ఏర్పాట్లు కల్పించారు. సెంఢ్వా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తిరుపతికి సైకిల్ మీద వస్తానని మొక్కుకోవటంతో ఆయన సైకిల్‌యాత్రగా తన అనుచరులతో తిరుపతికి బయలుదేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గం సెంఢ్వా నుంచి దాదాపుగా 800ల కిలోమీటర్ల దూరం సైకిల్‌యాత్రగా బయలుదేరి చేవెళ్లకు ఆదివారం చేరుకున్నారు. రాత్రి కావటంతో చేవెళ్ల ఎమ్మెల్యేకు కాలె యాదయ్యకు ముందుగానే సమాచారం ఇవ్వటంతో ఆయన చేవెళ్లలో వారికి స్వాగతం పలికారు. రాత్రి బస కల్పించి భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వారి వారి రాష్ట్రాల్లో ఎలా ఉందనే పలు విషయాలను ఈ సందర్భంగా చర్చించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున వారు సైకిల్ యాత్రగా బయలుదేరి వెళ్లారు. స్వాగతం పలికిన ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు పెంటయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పాండుయాదవ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

ఎంపీడీఓ సుమతి



పాఠశాలలో మధాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమతి

**నందిగామ:** విద్యార్థుల కోసం ఏర్పాటు చేసే మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఎంపీడీఓ సుమతి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మింగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారు, ఎంతమేరకు భోజనాన్ని సిద్ధం చేశారని వంట నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. 15 మంది విద్యార్థులకు ఉడకబెట్టిన గుడ్లు అందలేదని, ఎందుకు తక్కువ గుడ్లు ఉడకబెట్టారని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునఃరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన విధంగా తప్పనిసరిగా మెనూను అనుసరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ తేజ్‌సింగ్, హెచ్‌ఎం సుధాకర్, గ్రామ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి మరుగుదొడ్లు



పాఠశాలలో మరుగుదొడ్లను ఉపయోగించుకుంటున్న విద్యార్థులు

**చేవెళ్ల:** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. వచ్చిన 2లక్షల నిధులు సరిపడకపోవటంతో ఈ పనులు చేపట్టిన మాజీ సర్పంచ్ తన సొంత నిధులను ఖర్చు చేసి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థులకు మరుగుదొడ్ల సమస్య తీరిందని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామ నాయకులకు, దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



ఉపాధ్యాయుల సన్మాన సభ ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**చేవెళ్ల:** నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు 5వ తేదీన నిర్వహించే సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని మల్కాపూర్‌గేట్ సమీపంలో ఉన్న పద్మావతి కన్వెన్షన్‌లో సోమవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ.. అక్టోబర్ 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ఉపాధ్యాయులందరికీ సన్మాన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.

### కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న భూపాలచారి

**కొందుర్గు:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులతో పోటీ చేయించి గెలిపించుకోవాలన్నారు. ఇందుకు ప్రజల్లో ఉంటూ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, ఆంజనేయులు, కృష్ణయ్య, జంగయ్య, సాయి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బతుకమ్మ సంబురాలు



చేవెళ్లలోని ఓ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

**షాబాద్:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ సంబురాలను మండల కేంద్రంలోని రామాలయంలో మహిళలు సోమవారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చుకొని పాటలు పాడుకుంటూ ఆటలు ఆడారు. వారు తీసుకొచ్చిన పిండి వంటలను ఒకరికి ఒకరూ పంచుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, తదితరులు ఉన్నారు.

**పాఠశాలలో..**

**చేవెళ్ల:** మండలంలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తహసీల్దార్ రాజేశ్వర్



కొత్తూరు: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న రేవతి



నందిగామ: మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వర్

**నందిగామ:** చిన్నారులకు తల్లిపాలు మరిచిన వెంటనే పోషకాహారం అందించడం అలవాటు చేయాలని తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం చిన్నారుల కోసం పోషకాహారం అందిస్తోందని, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు(ప్రీ స్కూల్)లకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నప్పటి నుంచే మంచి పోషకాలు గల ఆహారాన్ని అందించినట్లయితే పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఉంటారన్నారు. బాలామృతం, చిరుధాన్యాలు, ఉడకబెట్టిన గుడ్లు, ఆకు కూరలు, కూరగాయలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ తేజ్‌సింగ్, పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహారాలు తప్పకుండా తీసుకోవాలి

**కొత్తూరు:** మహిళలు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని కొత్తూరు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో సోమవారం ఆమె ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. పోషకాహారం లోపిస్తే రక్తహీనత, సరైన ఎదుగుదల లేకపోవడం, తరచూ అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యకరమైన సమాజ స్థాపనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వార ఉచితం పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సరోజిని, ఏఎన్‌ఎం సునంద, అంగన్‌వాడీలు జ్యోతి, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.